క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మకమలం


కుముదాంపేటలోని ఓ ఇంట్లో విరబూసిన బ్రహ్మకమలం

బుచ్చెయ్యపేట: కుముదాంపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రాధ ఇంట్లో బ్రహ్మకమలం పూలు విరబూశాయి. గురువారం రాత్రి ఆమె ఇంట్లో బ్రహ్మకమలం చెట్టుకు రెండు పూలు విరబూసి సుగంధ సువాసనలు వెదజల్లాయి. ఆగస్టు తర్వాత చల్లని కాలంలో మాత్రమే విరబూసే ఇవి మే నెలలోనే అందంగా దర్శనమిచ్చాయి.

వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ


వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఏపీవో, హెల్త్ అసిస్టెంట్

కె.కోటపాడు: వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న కారణంగా ఉపాధి పని ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడం తప్పనిసరని ఏపీవో వసంత్ తెలిపారు. ఎ.కోడూరు ఉపాధి పని ప్రాంతంలో వేతనదారులకు శనివారం ఆయన లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్‌తో కలిసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయాన్నే 11 గంటల వరకు ఉపాధి పనులను చేయడం వల్ల వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. రోజువారి గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులను చేయాలని వేతనదారులకు సూచించారు. వీఆర్పీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

31న శాంతి హోమం

మాడుగుల: స్థానిక పురాతన వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 31న శాంతి హోమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ జాగాని పద్మలీల, కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆలయం వద్ద వారు మాట్లాడారు మత్స్య వంశ రాజులు కాలం నుంచి ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ దేవాలయంలో వివాహాలు ఇక నుంచి జరుగుతాయన్నారు.

వలంటీరుకు వితరణ

మాడుగుల రూరల్: ఎం. కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు గ్రామ వలంటీరు సోడే భారతికి బియ్యం, నగదు అందజేశారు. ఆమె తండ్రి అప్పారావు ఇటీవల మృతి చెందగా, శనివారం పెద్దకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా 50 కిలోల బియ్యం, వెయ్యి రూపాయలు అందజేశారు.

వైఎస్సార్ పశుబీమా వరం


రాంబాబు

నర్సీపట్నం: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ డబ్ల్యూ. రాంబాబు శనివారం తెలిపారు. వచ్చే నెల ఒకటి నుంచి పథకం అమల్లోకి వస్తుందన్నారు. ఒక కుటుంబంలో ఐదు గేదెలు, 50 గొర్రెలు, మేకలకు మాత్రమే బీమా వర్తిస్తుందన్నారు. రూ.30 వేల కలిగిన గేదె, ఆవుకు ప్రీమియం రూ.1,920, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు రూ.960 చెల్లించాలన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ


రోగులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న సూపరింటెండెంట్ నీలవేణిదేవి, నర్సింహమూర్తి

నర్సీపట్నం: సుదీర్ఘకాలం పాటు నర్సీపట్నం సర్పంచ్‌గా పనిచేసిన గొలుసు నారాయణ మూర్తి వర్ధంతి సందర్భంగా తనయుడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నర్సింహమూర్తి స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవితో కలిసి వీటిని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, దాడి బుజ్జి, నక్కా శ్రీను, కర్రి గోవింద్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా దుకాణాల తొలగింపు

- మెయిన్ రోడ్డు విస్తరణకు సహకరిస్తున్న వ్యాపారులు


పాత దుకాణాన్ని తొలగించి కొత్తగా నిర్మించిన ఆటోమొబైల్ షాపు

నర్సీపట్నం: పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణకు వ్యాపారుల్లో కదలిక వచ్చింది. ఇక్కడ రిలయన్స్ పెట్రోల్ బంకుకు ఎదురుగా కంకటాల ఆటోమొబైల్ దుకాణం యజమాని చినబాబు తన పాత దుకాణాన్ని తొలగించాడు. అధికారులు ఇచ్చిన మార్కింగ్ ఆధారంగా 50 అడుగుల మేర విడిచిపెట్టాల్సి ఉండగా, 60 అడుగులు వదిలిపెట్టి నూతన షాపు నిర్మించుకోవడం విశేషం. ఈయన్ను ఆదర్శంగా తీసుకుని మిగిలిన వారు దుకాణాలు తొలగించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విధంగా రోడ్డు విస్తరణకు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు.

అడ్డంకులను అధిగమిస్తూ...

గత టీడీపీ హయాంలో మెయిన్ రోడ్డును 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో ఇటు భవన యజమానులు, వ్యాపారులకు అటు ప్రజాప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సూచన మేరకు వందడుగుల మేర రోడ్డు విస్తరణకు మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. కౌన్సిల్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ భవన యజమానులు, వ్యాపారులు రోడ్డు విస్తరణ 80 అడుగులకు చేపట్టాలని ఆందోళన బాటపట్టారు. గతేడాది డిసెంబర్‌లో రోడ్డు విస్తరణకు బీజం పడినప్పటికీ మూడు, నాలుగు సార్లు సమావేశాలు నిర్వహించినప్పటికీ వ్యాపారులు సహకరించకపోవటం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రోడ్డు మార్కింగ్ ఇవ్వటం, అపోహలకు తావులేకుండా మున్సిపల్ అధికారులు (ఆర్‌డీపీ) రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేశారు. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణను అడ్డుకునేందుకు భవన యజమానుల ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదే క్రమంలో పక్కా రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ తయారీ వల్ల ఏర్పడిన జాప్యంతో రోడ్డు విస్తరణపై సందిగ్ధత ఏర్పడింది. వీటిని తలకిందులు చేస్తూ మున్సిపల్ అధికారులు తొలగింపునకు తాత్కాలిక నోటీసులు జారీ చేసి రోడ్డు విస్తరణ ఘట్టానికి అడుగు ముందుకేశారు. ఇచ్చిన నోటీసులకు గడువు దగ్గర పడుతుండటంతో ఒక్కొక్కరు స్వచ్ఛందంగా దుకాణాలు తొలగించుకునేందుకు ముందుకు వస్తున్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ బాధితులు 229 మంది ఉన్నారు. వీరిలో 163 మందికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీరిలో ఇంకా సహకరించని వారికి రెండో దఫా నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ కె. కనకారావు తెలిపారు. రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


దివ్యాంగురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే పరమావధిగా తపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను గ్రామ వలంటీర్లు నెరవేర్చాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం కె.జె.పురం– 2 సచివాలయం పరిధిలో ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. మండుటెండను సైతం లెక్క చెయ్యకుండా అధికారులతో కలిసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం –2 పరిధిలో 3,669 మంది లబ్ధిదారులకు 18 రకాల సంక్షేమ పథకాలు ద్వారా రూ.9,16,45,858 లబ్ధి చేకూరిందన్నారు. స్వయంగా పలు సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని, ప్రమాదకరంగా ఉన్న తీగలు సరి చేయాలని ఏఈని ఆదేశించారు. గ్రామంలో అవసరమైన చోట సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలపై సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు – 3, 4, 5లను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణులకు సీమంతాల కార్యక్రమంలో ఆశీర్వదించారు.

దాతృత్వం చాటుకున్న డిప్యూటీ సీఎం

తల్లి చనిపోయిన రాపేట కన్నశ్రీసాయికి, దివ్యాంగురాలు కోట్ల కొండమ్మకు, వృద్ధురాలు పరిమి శివలక్ష్మికి రూ.2 వేల చొప్పున డిప్యూటీ సీఎం బూడి తన సొంత నగదు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. వలంటీర్ల సేవలపై గ్రామస్తులను ఆరా తీయగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, ఏవో ఎం. వాసుదేవరావు, ఏఈఈలు లెక్కల సత్యనారాయణ, నర్సింగరావు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, పార్టీ సీనియర్ నాయకులు కాళ్ల అప్పలనాయుడు, ఆదారి కన్నారావు, మళ్ల కన్నబాబు, భీశెట్టి జగ్గప్పారావు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గొల్లవిల్లి సంజీవిరావు, యడ్ల కళావతి, కర్రి గణేశ్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు బ్రాంచి ఏర్పాటుకు వినతి

మాడుగుల రూరల్: మండలంలో వీరనారాయణంలో కెనరా బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విశాఖలో కెనరా బ్యాంకు ప్రాంతీయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. పలు సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు ప్రజలు ఖాతాల్లో వేస్తున్నారని, వీరనారాయణం గ్రామాన్ని మాడుగుల గ్రామీణ వికాస్ బ్యాంకు దత్తత తీసుకుందని, పూర్తి స్థాయిలో సేవలు అందించలేదని, ఈ దృష్ట్యా కెనరా బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామానికి ఆనుకుని జి.అగ్రహారం, చింతలూరు, గదబూరు, జంపెన, గాదిరాయి, సత్యవరం, ఎం. కృష్ణాపురం గ్రామాల్లో పలు సంఘాలకు ప్రయోజనం కలుగుతుందని కాళ్ల బాలకృష్ణ, తదితరులు తెలిపారు.

ఆరోగ్య విస్తరణాధికారి బదిలీ

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణాధికారిగా పని చేస్తున్న శ్రీనివాసరావుకు ఇక్కడ నుంచి చూచుకొండ పీహెచ్‌సీకి బదిలీ అయింది. ఇక్కడ ఆయన 2017 ఏప్రిల్‌లో విధుల్లో చేరి బాధ్యాతాయుతంగా పని చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇవి ఆయనకు వర్తించి బదిలీపై వెళ్లారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామివారి మహోత్సవాలు


వేంకటేశ్వర స్వామి నూతన ఆలయం

దేవరాపల్లి: మారేపల్లి గ్రామం శారదా నది ఒడ్డున పాండవుల మెట్టపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు కవిత అగ్రి ఫారమ్స్ అధినేత డి.వి. అప్పారావు శనివారం తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాండవుల మెట్టపై డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పర్యవేక్షణలో భూవరహా, జయ, విజయ, శ్రీచక్ర మేరువు, గరుడ, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ, పసిడి కలశ ప్రతిష్ఠ, పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం నిర్వహిస్తామన్నారు. ఆదే రోజు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. మారేపల్లి, తారువ, వాకపల్లి, వెంకటరాజుపురం, తెనుగుపూడి, తిమిరాం తదితర గ్రామాల ప్రజల కోరిక మేరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఎరుకునాయుడుకు ఘన నివాళి

చీడికాడ: పార్టీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీనివాసరావు తండ్రి ఎరుకునాయుడు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. శనివారం ఖండివరంలో ఎరుకునాయుడు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద డిప్యూటీ సీఎంతోపాటు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మాడుగుల ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు, తదితరులు పూలమాలతో ఘన నివాళులర్పించారు. చోడవరం, మాడుగుల, పెందుర్తి, నర్సీపట్నం, యలమంచిలి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి


గిడుతూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

వాకవరపాలెం: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీవో అరుణశ్రీ ఆదేశించారు. గిడుతూరులో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేసి, రోగులకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం జగనన్న కాలనీని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని, అంతే త్వరగా బిల్లులు చెల్లింపు ఉంటుందన్నారు. సచివాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ప్రజలకు నిరంతరం సక్రమంగా సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ జేఈ రామలింగస్వామి, కార్యదర్శి రాజారావు పాల్గొన్నారు.

ఉపాధి సమస్యలపై చలో కలెక్టరేట్ రేపు


గుల్లేపల్లిలో కరపత్రాలు పంచిపెడుతున్న సీఐటీయూ కార్యదర్శి ప్రసాద్

కె.కోటపాడు: ఉపాధి సమస్యలపై ఈ నెల 29న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి హాజరు కావాలని సీఐటీయూ మండల కార్యదర్శి గాడి ప్రసాద్ కోరారు. మండలంలో గుల్లేపల్లి, కె.సంతపాలెం గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. అక్కడ వేతనదారులకు కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో రూ.2 లక్షల 40 వేల కోట్లు కేటాయించాలన్నారు. వేతనదారులకు పెండింగ్ బకాయిలతోపాటు గునపాం, పారలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతీ కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పనిదినాలను కల్పించడంతోపాటు దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్రా దేముడు, నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


దేవరాపల్లిలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

కె.కోటపాడు: వేసవి విజ్ఞాన శిబిరంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి తెలిపారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వచ్చే నెల 11వ తేదీన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

దేవరాపల్లి: విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయని గ్రంథపాలకుడు ఓ. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వక్తృత్వ, బుక్ రీడింగ్, కథల పోటీలను నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే నిత్యం యోగా చేయాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, వైద్యుడు గండి వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో పట్టణంలో జార్జి క్లబ్ యోగ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ర్యాలీ నిర్వహించారు.

అవినీతి రహిత పాలనతో పేదలందరికీ సంక్షేమం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


నర్సాపురంలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి లేకుండా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి, అన్ని వర్గాలకు అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. నర్సాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం, వలంటీర్ల పని తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు మంజూరైనప్పుడు వలంటీర్లకు గాని, నాయకులకుగాని ఎవరికైనా లంచాలు ఇచ్చారా అని ధర్మశ్రీ ప్రశ్నించగా, తాము ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వలేదని వారంతా బదులిచ్చారు. అవినీతి, లంచగొండితనం లేకుండా నేరుగా అర్హతే కొలమానంగా పార్టీలకతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సాధికారత ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు సబ్సిడీ ఇవ్వడంతోపాటు నేరుగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పండిన పంటను అక్కడే అమ్ముకునే విధంగా అన్ని సౌకర్యాలు తెచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, గ్రామ సర్పంచ్ దొడ్డి అప్పారావు, మాజీ సర్పంచ్ దొడ్డి హనుమంతు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- వందన సన్మాన సభలో విప్ కరణం ధర్మశ్రీ


బుచ్చెయ్యపేటలో వలంటీర్లతో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


వలంటీర్లను సన్మానిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్వేత, ఎంపీటీసీ అచ్చిబాబు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ప్రజా సేవకు అంకితమైన వలంటీర్లు అభినందనీయులని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. వలంటీర్లకు వందనం సన్మాన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉత్తమ వలంటీర్లను సత్కరించి ప్రశంసాపత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ వలంటీర్లు లాభాపేక్షతో కాకుండా మదర్‌థెరిసా, జ్యోతిబాపూలే, లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని, వారి అడుగుజాడల్లో నడుచుకుంటూ ప్రజా మన్ననలను పొందాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హత ఉన్న కుటుంబానికే రాజకీయాలకతీతంగా అందాలన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే ఎప్పుడిచ్చేవారో తెలిసేది కాదని, వృద్ధులు, దివ్యాంగులు ఎండలో గంటల తరబడి నిలబడాల్సి వచ్చేదని వాపోయారు. నేడు జగనన్న పుణ్యమా అని ఒకటో తేదీన ఉదయం ఐదు గంటలకే లబ్ధిదారు ఇంటి తలుపుతట్టి వలంటీర్ అందిస్తున్నారన్నారు. మండలంలో 390 మంది గ్రామ వలంటీర్లు ఉన్నారని, కొంతమంది పనితీరు మార్చుకుని ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను శతశాతం నిర్వర్తించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితానారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుంకరి శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పెదిరెడ్ల మాణిక్యం, వేపాడ మధు, కె. వెంకటరావు, పెద్దాడ నాయుడు, చొప్పా బాబూరావు, తమరాన రమణ, పాతాళ సత్తిబాబు, సుంకరి గాంధీ, ఐయితంరెడ్డి చినబాబు పాల్గొన్నారు.

వలంటీర్‌ల సేవలు ప్రశంసనీయం

కె.కోటపాడు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ వారధుల్లా పని చేస్తున్న వలంటీర్లు అభినందనీయులని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అల్లు శ్వేత, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు తెలిపారు. శనివారం కొరువాడ జగన్నాథపురంలో వలంటీర్లకు వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ వలంటీర్లను దుశ్శాలువాలతో సన్మానించి, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. వలంటీర్లు సేవాభావంతో పని చేస్తూ పైసా అవినీతికి తావులేకుండా క్లస్టర్ల పరిధి కుటుంబాలకు సంక్షేమ లబ్ధిని వర్తింపజేస్తున్నారని సచివాలయ కన్వీనర్ చీపురపల్లి గోవింద, పార్టీ కన్వీనర్ యడ్ల దేముళ్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీకే వ్యవసాయశాఖ సహాయకుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వైఖరిని నిరసిస్తూ 29న బైక్ ర్యాలీ

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: టీడీపీ దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ నెల 29న నర్సీపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి కుటుంబం తలెత్తుకుని జీవించాలనే సంకల్పంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. అమరావతిలో పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికతో చంద్రబాబు పోల్చడం దారుణమన్నారు. పేదలంటే అంత అసూయ ఎందుకని ప్రశ్నించారు. బైక్ ర్యాలీ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రూ.7.50 లక్షలతో గిరిజనులకు రోడ్డు సౌకర్యం

- ఎంపీపీ శ్రీనివాసరావు



రోలుగుంట: గిరిజన గ్రామాల రహదారి సమస్యలపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టి సారించారని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ గత నెల లోసింగిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అర్ల గిరిజన పంచాయతీ శివారు పాత లోసింగి, కొత్త లోసింగి, పీత్రుగెడ్డ తదితర గ్రామాల గిరిజనులకు రహదారితోపాటు పలు సమస్యలు తెలుసుకున్నారన్నారు. వీటి పరిష్కార చర్యల్లో భాగంగా ఆ గ్రామాలకు రహదారి ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు. అందుకోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ.7.50 లక్షలు మంజూరు చేసి, శంకుస్థాపన చేశామన్నారు. ఈ పనులు పూర్తయితే రోలుగుంట మండలంలో మైదాన ప్రాంతానికే కాకుండా రావికమతం మండలం చలిసింగం, వయా జెడ్. కొత్తపట్నం మీదుగా రావికమతం, కొత్తకోట మైదానంలో ప్రధాన గ్రామాలకు వెళ్లే రహదారి సమస్య మెరుగుపడుతుందన్నారు. మైదాన ప్రాంతంలో బీఎన్ రోడ్డు విస్తరణ పనులు వెలంకాయలపాలెం నుంచి వడ్డాది కూడలి వరకు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- నాగయ్యపేటలో మండల ప్రత్యేకాధికారి రవీంద్ర పరిశీలన


నాగయ్యపేటలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రవీంద్ర, ఎంపీడీవో

దేవరాపల్లి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.రవీంద్ర లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా నాగయ్యపేటలో పక్కా ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, అందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇళ్లు నిర్మించిన వెనువెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంకా ముందుకు రాని వారు తక్షణమే పనులు ప్రారంభించాలని సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ భవ్యతేజ, ఏపీవో డి. చంద్రకళ, ఏపీఎం ఎస్. ప్రభాకర్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ పాల్గొన్నారు.